సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

సోమవారం | 1 | సెప్టెంబర్ | 2025



'కూలి'న బతుకులు! 8లో

కొత్తచెరువు మండలం మైలసముద్రం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మహిళా కూలీలు మృతి చెందారు.



టమాట కిలో రూ.25

అనంతపురం కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.25 పలికింది. కనిష్టం రూ.14, సరాసరి రూ.19 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
34.7°/21.2°

జిల్లా పరిధిలో ఆదివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. నైరుతి నుంచి పశ్చిమ దిశగా గంటకు 8 నుంచి 14 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

ఇరువర్గాల ఘర్షణలో యువకుడి మృతి



శ్రీకాంత్ (ఫైల్)

తలుపుల: కమీషన్‌లో వాటా కోసం ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణ ఓ యువకుడి ప్రాణాలను బలిగొంది. మరో ఇద్దరు స్వల్పంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రం తలుపులలోని బలిజపేటలో డిష్ శ్రీనివాసులు, వెంకటరాయప్ప కుటుంబాలు నివాసముంటున్నాయి. శ్రీనివాసులు కుమారుడు అనురుద్దీన్.. వెంకటరాయప్ప కుమారుడు రాజారామ్ స్నేహితుని భార్యకు బ్యాంకు లోన్ ఇప్పించాడు. ఇందుకు అనురుద్దీన్ కొంత కమీషన్‌గా తీసుకున్నాడు. ఆ కమీషన్‌లోంచి తనకు కూడా కొంత ఇవ్వాలని రాజారామ్ కోరగా అనురుద్దీన్ నుంచి స్పందన లేదు. దీంతో ఆదివారం అతడి ఇంటివద్దకు వెళ్లగా మగవారు లేరు. దీంతో కుటుంబ సభ్యులతో గొడవపడి అక్కడే ఉన్న ద్విచక్రవాహనాన్ని ధ్వంసం చేశారు. తర్వాత విషయం తెలుసుకున్న శ్రీనివాసులు కుటుంబ సభ్యులు ఆవేశంలో నేరుగా రాజారామ్ ఇంటికెళ్లి వాగ్వాదానికి దిగారు. ఆగ్రహించిన రాజారామ్ కత్తితో డిష్ శ్రీనివాసులు కోడలు తమ్ముడు కె.క్రిష్టయ్య కుమారుడు కె.శ్రీకాంత్ (28)ను పొడిచాడు. అడ్డుకోబోయిన శ్రీనివాసులు, మరొకరిపైనా దాడి చేసి గాయపరిచాడు. తీవ్రంగా గాయపడిన శ్రీకాంత్‌ను కదిరి ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలోనే మృతి చెందాడు. శ్రీకాంత్‌కు భార్య, మూడు నెలల వయసు గల కుమారుడు ఉన్నారు. డిష్ శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు రాజారామ్‌తో సహా ముగ్గురిపై కేసు నమోదు చేశారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పూల శ్రీనివాసరెడ్డి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

సాయి కథ.. దివ్య చరిత



సాంస్కృతిక ప్రదర్శనలోని ఘట్టం

ప్రశాంతి నిలయం: సత్యసాయి లీలలు, లోక కల్యాణార్థం చేసిన సేవలు, మానవాళి సన్మార్గ పయనం కోసం చేసిన ఆధ్యాత్మిక బోధనలను వివరిస్తూ చిన్నారులు చేసిన ప్రదర్శన భక్తులను మైమరిపించింది. దేశ వ్యాప్తంగా 103 సత్యసాయి పాఠశాలలకు చెందిన 2,400 మంది విద్యార్థులు ప్రశాంతి నిలయంలో నిర్వహించిన సమావేశం ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా సత్యసాయి విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శన నిర్వహించారు. న్యూ ఢిల్లీకి చెందిన శ్రీసత్యసాయి విద్యా విహార్ విద్యార్థులు 'సాయి కథ' పేరుతో సంగీత నృత్యరూపకం ప్రదర్శించారు. సత్యసాయి చరిత్రను చక్కగా వివరిస్తూ నృత్యరూపకం సాగింది. చెన్నైకి చెందిన శ్రీ సత్యసాయి ఎడ్యుకేర్ విద్యార్థులు హృదయీశ్వరా.. సాయీశ్వరా పేరుతో నృత్య ప్రదర్శన నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక, భక్తిరస ప్రదర్శనతో సాయికుల్వంత్ సభా మందిరం మార్మోగింది.

చేనేతపై పవర్ పంజా

- మరమగ్గాలపై ఇబ్బడిముబ్బడిగా పట్టుచీరల తయారీ
- చేనేత రిజర్వేషన్ చట్టానికి యథేచ్ఛగా తూట్లు
- తక్కువ ధరకే మార్కెట్లో విక్రయాలు
- చేత్తో నేసిన చీరలకు భారీ దెబ్బ

చేనేత రంగం పీకల్లోతు సంక్షోభంలోకి కూరుకుపోతోంది. చేతితో నేసిన పట్టుచీరలకు జిరాక్స్‌లాగా మరమగ్గాలపై ఇబ్బడి ముబ్బడిగా తయారు చేసి చేనేత రిజర్వేషన్ చట్టానికి మరమగ్గాల మాఫియా తూట్లు పొడుస్తోంది. దీంతో చేనేత మగ్గంలో తయారు చేసిన పట్టుచీరలకు గిరాకీ గణనీయంగా తగ్గుతోంది. పెరిగిన ముడిపట్టు ధరలు, కార్మికులకు తగిన కూలి లేకపోవడంతో గత్యంతరం లేని స్థితిలో నేతన్నలు మగ్గాలు నిలిపివేస్తున్నారు.



ధర్మవరంలో మూత పడిన చేనేత మగ్గం



మగ్గం పనిలో నిమగ్నమైన నేతన్న



పవర్ లూమ్స్‌పై తయారవుతున్న పట్టుచీరలు

అచ్చం చేనేత పట్టు చీరలను పోలిన పవర్‌లూమ్స్ చీరలు



ప్లాస్టిక్ సంచులలో ధర్మవరానికి రవాణా చేస్తున్న పవర్‌లూమ్స్‌లో తయారైన పట్టు చీరలు

ధర్మవరం: ఉమ్మడి అనంతపురం జిల్లాలో చేనేత కేంద్రాలైన ధర్మవరం, యాడికి, ముదిరెడ్డిపల్లి, సోమందేపల్లి, కోటంక, మర్తాడు, తాడిపత్రి, నార్పల తదితర ప్రాంతాల్లో 30 వేల దాకా చేనేత మగ్గాలు ఉన్నాయి. ప్రత్యక్షంగా, పరోక్షంగా ఈ రంగంపై ఆధారపడి 1.50లక్షల మందికి పైగా కార్మికులు జీవనం సాగిస్తున్నారు. మొన్నటి వరకు ఒక వెలుగు వెలిగిన చేనేత మగ్గాలకు 'పవర్‌లూమ్స్(మరమగ్గాలు)' యమపాశాలుగా మారాయి. ఒక కార్మికుడు మగ్గంపై ఐదు రోజులకు ఒక చీర నేస్తే అదే పవర్‌లూమ్స్‌లో రోజుకు రెండు చీరలు తయారవుతున్నాయి. చేనేత మగ్గంలో తయారైన చీర కన్నా మరమగ్గంపై తయారైన పట్టు చీరను 30 శాతం తక్కువ ధరకు విక్రయిస్తుండటంతో చేనేత మగ్గాల వైపు వ్యాపారులు కన్నెత్తి కూడా చూడటం లేదు.

పవర్‌లూమ్స్‌లో నిబంధనలు బేఖాతర్..

పొరుగు రాష్ట్రమైన కర్ణాటకలోని దొడ్డబళ్లాపూర్, యలహంక, బాగేపల్లి, బెంగళూరుతో పాటు జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి రోజూ రూ.కోట్లు విలువ జేసే పవర్‌లూమ్స్ పట్టు చీరలను ధర్మవరం మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. వాస్తవంగా అయితే పవర్‌లూమ్స్‌లో చేనేత రిజర్వేషన్ చట్టం ప్రకారం వంద శాతం పట్టు దారంతో, డిజైన్‌లను తయారు చేయకూడదు. పవర్‌లూమ్స్‌లో తయారయ్యే పట్టు చీరలలో 52 శాతానికి మించి జరీ వాడకూడదు. బార్డర్, పల్లూ డిజైన్‌లు చేనేత మగ్గంలో తయారయ్యే వాటిని వాడకూడదన్న నిబంధనలు ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం 11 రకాల డిజైన్‌లను మరమగ్గాలలో తయారు చేయకూడదన్న నిబంధనలతో ప్రత్యేక చట్టాన్ని రూపొందించింది. అయితే ఈ నిబంధనలను తుంగలో తొక్కి ఇష్టారాజ్యంగా పట్టు చీరలు తయారు చేసి చేనేతలను దెబ్బ తీస్తున్నారు.

మామూళ్ల మత్తులో అధికారులు..

11 రకాల చేనేత రిజర్వేషన్ చట్టాన్ని అమలు చేయాల్సిన హ్యాండ్లూమ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారన్న విమర్శలు ఉన్నాయి. రిజర్వేషన్ చట్టానికి తూట్లు పొడుస్తూ మరమగ్గాలలో పట్టుచీరల తయారీకి అడ్డు చెప్పకుండా ఉండాలంటే ఉమ్మడి అనంతపురం జిల్లాలో మాస్టర్ వీవర్ ప్రతి నెలా రూ.5వేలు లంచం ఇవ్వాలని షరతు పెట్టి.. వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో ధర్మవరంలో అరకొరగా 200 దాకా ఉన్న మరమగ్గాలు కూటమి ప్రభుత్వం వచ్చాక వేల సంఖ్యకు చేరుకున్నాయి. అధికారులకు లంచం ఇవ్వకపోతే మగ్గాల వద్దకు వెళ్లి హడావుడి చేయడం.. వార్పులు కోసేయడం వంటి చర్యలకు దిగుతున్నారు.

మూత పడుతున్న చేనేత మగ్గాలు..

మరమగ్గాల ధాటికి చేనేత మగ్గాలు నష్టాలను చవి చూస్తుండటంతో క్రమంగా మూతపడుతున్నాయి. గతంలో అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేతి మగ్గం ఉన్న ప్రతి చేనేత కుటుంబానికీ 'నేతన్న నేస్తం' కింద ఏడాదికి రూ.24వేలు సాయం అందించేది. కూటమి ప్రభుత్వం నేతన్న నేస్తం పథకానికి తొలి యేడాది మంగళం పాడింది.

పెరుగుతున్న చేనేత కార్మికుల ఆత్మహత్యలు

మరమగ్గాల పోటీ తట్టుకోలేక, అధిక వడ్డీలకు తెచ్చిన అప్పులు తీర్చలేక ఇటీవల పలువురు చేనేత కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడిన ఉదంతాలు ఎన్నో వెలుగు చూస్తున్నాయి.

'రిజర్వేషన్'తోనే మనుగడ



కేంద్ర ప్రభుత్వం చేనేతలకు కేటాయించిన 11రకాల రిజర్వేషన్ చట్టాన్ని పటిష్టంగా అమలు చేస్తేనే చేనేత రంగం మనుగడ సాగిస్తుంది. లేకపోతే ఒకప్పుడు చేతి మగ్గం ఉండేదన్న విషయాన్ని భావితరాలు చెప్పుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. రిజర్వేషన్ చట్టాన్ని అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయి. ఇక హ్యాండ్‌లూమ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారు.

– జింకా కంబగిరి, జిల్లా అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ చేనేత విభాగం

కూలి గిట్టుబాటు కావడం లేదు



కర్ణాటకలో పవర్‌లూమ్స్‌లో తయారు చేసిన పట్టుచీరలు మన ప్రాంతానికి తీసుకొచ్చి తక్కువ ధరకు విక్రయిస్తుండటంతో ఇక్కడి చేనేత కార్మికుల ఉపాధి దెబ్బతింటోంది. దీనికి తోడు జిల్లాలోనూ మరమగ్గాలను పోటాపోటీగా ఏర్పాటు చేసి చేనేతను చావుదెబ్బతీస్తున్నారు. దీంతో చేతిమగ్గంపై నేసిన పట్టు చీరకు కూలి కూడా గిట్టుబాటు కాక మూత వేసే పరిస్థితి ఏర్పడుతోంది. ఈ పరిస్థితి ఇలానే కొనసాగితే మగ్గాలను నిర్వహించలేం.

– శంకర్, చేనేత కార్మికుడు, కేశవనగర్, ధర్మవరం.

పని దొరకడం లేదు



ముడిపట్టు ధరలు విపరీతంగా పెరిగాయి. చేతి మగ్గంపై తయారు చేసిన పట్టుచీరకు డిమాండ్ ఉండడం లేదు. మరమగ్గాలపై తయారు చేసిన పట్టు చీరలు తక్కువ ధరకు విక్రయిస్తుండటమే ఇందుకు కారణం. చేనేత మగ్గంపై నేసే మాలాంటి వారికి చేద్దామన్నా పని దొరకడం లేదు. దీంతో కార్మికులకు అప్పుల బాధలు, ఆత్మహత్యలు శరణ్యమవుతున్నాయి.

– కాంతమ్మ, చేనేత కార్మికురాలు, ధర్మవరం



ధర్మవరంలో నిమజ్జనానికి గణనాథులను ట్రాక్టర్‌లలో తరలిస్తున్న భక్తులు



ధర్మవరంలో నిమజ్జనానికి తరలివెళుతున్న భారీ వినాయకుడు

వినాయక.. సెలవిక

ధర్మవరం అర్బన్: వినాయక ఉత్సవాల్లో ఐదోరోజు ఆదివారం ధర్మవరం, కదిరి, హిందూపురం తదితర ప్రాంతాల్లో భారీ ప్రతిమల నిమజ్జనం భక్తిశ్రద్ధల నడుమ సాగింది. మంటపాల్లో కొలువుదీరిన గణేశుడు ఐదు రోజులపాటు ప్రత్యేక పూజలందుకున్నారు. నిమజ్జనం సందర్భంగా అన్నదానాలు.. లడ్డూ ప్రసాదాల వేలం నిర్వహించారు. అనంతరం శోభాయాత్ర ప్రారంభమైంది. ప్రత్యేక వాహనాల్లోకి విగ్రహాలను కొలువుదీర్చి ఊరేగింపుగా తీసుకెళ్లారు. డ్రమ్స్ వాయిద్యాల నడుమ యువత, మహిళలు, చిన్నారులు చిందులు వేశారు. గణపతి బప్పా మోరియ.. జై బోలో గణేశ్ మహరాజ్‌కీ జై.. పార్వతీ తనయుడు వినాయకునికి జై అంటూ నినదించారు. అనంతరం చెరువులు, కాలువలు, నీటి కుంటలు, వంకల్లో నిమజ్జనం చేశారు.



ధర్మవరం చెరువులో క్రేన్ సాయంతో వినాయక విగ్రహాన్ని నిమజ్జనానికి తీసుకెళ్తున్న దృశ్యం

గణేశ్ శోభాయాత్రలో అపశ్రుతి

- ట్రాక్టర్ దూసుకెళ్లి యువకుడి మృతి
- మరో 8 మందికి గాయాలు



మృతి చెందిన మారుతి, గాయపడిన సౌభాగ్యమ్మ

హిందూపురం: గణేశ్ నిమజ్జన శోభాయాత్రలో అపశ్రుతి చోటు చేసుకుంది. నిదానంగా ముందుకు సాగుతున్న వేళ డ్రైవర్ ఉన్నపళంగా ఎక్సలేటర్ తొక్కడంతో ట్రాక్టర్ ముందు భాగంలో ఉన్న భక్తులపై దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఓ యువకుడు మృతి చెందగా.. మరో ఎనిమిది మంది తీవ్రంగా గాయపడ్డారు. వివరాలిలా ఉన్నాయి. హిందూపురంలోని మారుతినగర్ మెయిన్‌రోడ్డులో శుక్రవారం నిమజ్జనం కోసం గణేశ్ విగ్రహాల ఊరేగింపు జరుగుతోంది. ఓ ట్రాక్టర్ ముందు భాగంలో భక్తులు నృత్యాలు చేసుకుంటూ వస్తుండగా.. డ్రైవర్ అకస్మాత్తుగా ఎక్సలేటర్ తొక్కాడు. అంతే ట్రాక్టర్ ఒక్క ఉదుటున ముందుకు వేగంగా కదిలి.. సౌభాగ్యమ్మ, మారుతి, ఆదర్శ, మమత, ఉమాదేవి, దీక్షిత, వేదవతి, గంగరత్నమ్మ, కీర్తనపైకి దూసుకెళ్లింది. తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో మారుతి (35)తో పాటు సౌభాగ్యమ్మ తలకు తీవ్రగాయాలై పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో బెంగళూరు ఆస్పత్రికి తరలించారు. అక్కడ మారుతి చనిపోయాడు. మిగిలిన క్షతగాత్రులు హిందూపురం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

- ఇదిలా ఉండగా హిందూపురం మండలం బాలంపల్లి వద్ద ఆదివారం రాత్రి ద్విచక్రవాహనంపై వేగంగా వస్తున్న మనోహర్ అనే యువకుడు స్పీడ్ బ్రేకర్‌ను గమనించకుండా అలాగే పోనివ్వడంతో ఎగిరి కిందపడ్డాడు. తలకు గాయాలయ్యాయి.

వైద్యం.. దైన్యం



కొత్తచెరువు సీహెచ్‌సీ ఆస్పత్రికి అదే గ్రామానికి చెందిన డెయిరీ రాజా (రాజశేఖర్) ఆదివారం వైద్యం కోసం వచ్చాడు. అయితే సిబ్బంది ఎవరూ స్పందించకపోవడంతో ఆయనే తన కాలుకు డ్రెస్సింగ్ చేసుకుని కట్టు కట్టుకుని వెళ్లిపోయాడు. ఇదేంటని అక్కడి ప్రజలు అడగ్గా.. డాక్టర్లు, సిబ్బంది పట్టించుకోలేదని.. 'నేనే రోగిని.. నేనే డాక్టర్‌ను' అంటూ వెళ్లిపోయాడు. అక్కడ ఉన్న వాళ్లందరూ అవాక్కయ్యారు.

- కొత్తచెరువు ఆస్పత్రికి శుక్రవారం జ్వరంతో బాధపడుతున్న ఓ రోగి వెళ్లాడు. రక్త పరీక్షలు చేశారు. అప్పటికే మధ్యాహ్నం దాటింది. వినాయక నిమజ్జనం సందర్భంగా ఉన్నఫలంగా కరెంటు కోత విధించారు. దీంతో ల్యాబ్‌లో పరీక్షలు చేసే వారు రిపోర్టులు ఇవ్వలేకపోయారు. మరుసటి రోజు రావాలంటూ సూచించారు. ఆదివారం ఉదయం వెళ్తే ల్యాబ్‌లో ఎవరూ లేరు. దిక్కుతోచని స్థితిలో ప్రైవేటు ఆస్పత్రికెళ్లి వైద్యం పొందారు.

జిల్లా కేంద్రం పుట్టపర్తికి కూతవేటు దూరంలోని కొత్తచెరువులో మాత్రమే కాదు.. జిల్లాలోని ప్రతి ప్రభుత్వాస్పత్రిలోనూ రోగులు ఇలాగే అవస్థలు పడుతున్నారు. హిందూపురం, ధర్మవరం, కదిరి, పెనుకొండ, మడకశిర, ముదిగుబ్బ, గోరంట్ల.. ఇలా ప్రతి చోట వైద్యుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. దీంతో రోగులు దిక్కు తోచని స్థితిలో ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించాల్సి వస్తోంది.



హిందూపురం జిల్లా ఆస్పత్రి వద్ద ఓపీ చీటీల కోసం క్యూలో నిల్చున్న మహిళలు



కొత్తచెరువు సీహెచ్‌సీలో డాక్టర్ కోసం నిరీక్షిస్తూ.. బెంచీపైనే నీరసంగా పడుకున్న రోగులు

- ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగుల అవస్థలు
- విధుల్లో ఆస్పత్రి సిబ్బంది, వైద్యుల నిర్లక్ష్యం
- గంటల తరబడి వేచి చూసినా అందని వైద్యం
- టెస్టులు రాసిస్తారు.. రిపోర్టులు వచ్చే లోపు జంప్

సాక్షి పుట్టపర్తి: రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లాలో ప్రభుత్వ వైద్యం దైన్యంగా మారింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. ఏ పల్లెలో చూసినా రోగులు పదుల సంఖ్యలో ఆస్పత్రుల బాట పడుతున్నారు. వారం రోజుల నుంచి ఓపీ రోగుల సంఖ్య రెట్టింపు అయ్యింది. అయితే రోగులకు వైద్యం చేయడానికి సరిపడా సిబ్బంది ఆస్పత్రిలో లేరు. డాక్టర్లు పట్టించుకోవడం లేదు. సకాలంలో వైద్యం అందక ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. ఆర్థిక స్తోమత లేనివాళ్లు.. గంటల తరబడి.. కొన్ని రోజుల పాటు నిరీక్షించి వైద్యం పొందుతున్నారు. అయినప్పటికీ రవాణా ఖర్చు.. బయట తినుబండారాలు రూ.వేలల్లో అవుతోందని వాపోతున్నారు. ఇక పెద్దాస్పత్రి అని హిందూపురం జిల్లా ఆస్పత్రికి వెళ్తే.. అక్కడ వైద్యులు, సిబ్బంది తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇలా వచ్చి.. అలా వెళ్తున్నారు!

ఉదయం 8 గంటలకే డాక్టర్లు విధులకు హాజరు కావాలి. ఇన్ పేషెంట్ల వార్డుల్లో రౌండ్లు పూర్తి చేసుకుని 9 గంటలకు ఓపీలోకి వచ్చి సేవలు అందించాలి. మధ్యాహ్న భోజనం తర్వాత సాయంత్రం 4 గంటల వరకు ఓపీ సేవలందించాలి. అయితే ఎక్కువమంది డాక్టర్లు చుట్టపుచూపుగా 10 గంటలకు వచ్చి.. పది నిమిషాల పాటు హడావుడి చేసి.. ఒక టీ తాగి.. గంట పాటు కాలక్షేపం చేసి మధ్యాహ్నానికి వెళ్లిపోతున్నారు. ఉన్నంత సేపు రోగులను పరిశీలించి పరీక్షలు చేయించుకోవాలని రిపోర్టులు రాసి.. రేపు వచ్చి కలవాలని సూచిస్తున్నారు.

జ్వర పీడితులే అధికం..

హిందూపురంలోని జిల్లా ప్రభుత్వాస్పత్రిలో ఓపీ రోగుల సంఖ్య సగటున రోజుకు 500 ఉండగా.. నాలుగైదు రోజుల నుంచి 800 దాటుతోంది. ధర్మవరం ఏరియా ఆస్పత్రిలో రోగుల సగటు 200 నుంచి 600 వరకు పెరిగింది. కొత్తచెరువు సీహెచ్‌సీలో 100 నుంచి 300 మంది వరకు వస్తున్నారు. రోగుల్లో 70 శాతం మంది జ్వరపీడితులే కావడం గమనార్హం. గత నెలతో పోలిస్తే జ్వరపీడితులు 20 శాతం పెరిగినట్లు తెలుస్తోంది.

వైద్యం కోసం మళ్లీ.. మళ్లీ!

ఏ ఆస్పత్రిలో చూసినా రోగులు మరుసటి రోజు మళ్లీ రావాల్సిన పరిస్థితి నెలకొంది. ఒకే రోగంతో పదే పదే ప్రభుత్వాస్పత్రుల చుట్టూ తిరుగుతున్నా.. సరైన వైద్యం అందడం లేదని వాపోతున్నారు. ఒక రోజు పరీక్షలు చేస్తారు. మరుసటి రోజు రిపోర్టులు ఇస్తారు. అదే రోజున డాక్టర్ పట్టించుకోరు. దీంతో మూడో రోజు వెళ్లి డాక్టర్‌ను సంప్రదించాల్సిన దుస్థితి ఏర్పడింది. ఆస్పత్రుల్లో రోగులను సరిగా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

స్వలాభం కోసమే లైనింగ్ పనులు



రౌండ్‌టేబుల్ సమావేశంలో ప్రసంగిస్తున్న వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.వి.రమణ

కదిరి: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తన స్వలాభం కోసమే హంద్రీ–నీవా కాలువ లైనింగ్ పనులు చేపట్టారని వెనుక బడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.వి.రమణ విమర్శించారు. ఆదివారం కదిరిలోని ఎన్జీఓ హోంలో 'సాగునీటి ప్రాజెక్టులు–విభజన హామీలు' అనే అంశంపై వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు వేదిక ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు జి.నారాయణరెడ్డి, జిల్లా కార్యదర్శి ఎ.శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు సాకే హరి ఇంకా వివిధ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు ప్రసంగించారు. హంద్రీ–నీవా ఫేజ్–2 కింద 7 ప్యాకేజీల్లో జరిగిన లైనింగ్ పనుల కోసం ప్రభుత్వం రూ.936 కోట్లు వెచ్చించిందన్నారు. కాలువ వెడల్పు చేయకుండా లైనింగ్ పనులు చేయడం ఎవరి ప్రయోజనాల కోసమని వారు ప్రశ్నించారు. ఇందులో టీడీపీ ముఖ్య నేతలకు భారీగా ముడుపులు అందాయని, అందుకే నాసిరకం పనులు చేసినా కూటమి నేతలెవ్వరూ నోరు మెదపడం లేదని ఆరోపించారు. లైనింగ్ పనులు చేపట్టడంతో భవిష్యత్‌లో భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటిపోతాయని అభిప్రాయ పడ్డారు. లైనింగ్ పనులు వద్దంటున్న రైతుల మాటలను సీఎం పరిగణనలోకి తీసుకోవడం లేదన్నారు. తన సొంత నియోజకవర్గం కుప్పంకు నీళ్లు తీసుకెళ్లాలనే ఉద్దేశంతోనే లైనింగ్ పనులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టి ఉమ్మడి అనంతపురం జిల్లా వాసులకు తీరని అన్యాయం చేశారని అభిప్రాయపడ్డారు. టీడీపీ హయాంలో తాగునీటి పథకంగా శిలాఫలకాలకే పరిమితమైన హంద్రీ–నీవాను తాగు, సాగునీటి ప్రాజెక్టుగా మార్చిన ఘనత మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి దక్కుతుందన్నారు. వైఎస్ చొరవతో 2009 నాటికే హంద్రీ–నీవా మొదటి దశ పనులు పూర్తయ్యాయని గుర్తు చేశారు. ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో దీన్ని 6,300 క్యూసెక్కులకు పెంచాలని నిర్ణయించి, ఇందుకోసం రూ.6,182 కోట్ల పరిపాలనా అనుమతులు కూడా ఇచ్చారని, అదే విధంగా టెండర్ల ప్రక్రియ కూడా పూర్తి చేశారని చెప్పారు.

విభజన హామీలపై నోరు మెదపరెందుకు..?

విభజన హామీలపై కూటమి పార్టీల నాయకులు నోరు మెదపకపోవడాన్ని వెనుక బడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక నాయకులు తప్పుబట్టారు. ఏపీకి ప్రత్యేక హోదా కావాలని కేంద్రాన్ని ఎందుకు డిమాండ్ చేయడం లేదని ప్రశ్నించారు. సీమకు జరుగుతున్న అన్యాయంపై ప్రతి నియోజకవర్గంలో 'వెనుక బడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక' కమిటీలు వేసి ప్రజల్ని చైతన్యం చేయాలని వారు నిర్ణయించారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి లింగాల లోకేశ్వరరెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ లింగాల మధుసూదన్‌రెడ్డి, కదిరి మండల కన్వీనర్ మణికంఠ నాయక్, రైతు విభాగం నాయకులు జైనుల్లా, సీపీఎం జిల్లా నాయకులు నరసింహులు, ఆర్‌సీపీ నాయకులు నాగన్న, రెడ్స్ సంస్థ నిర్వాహకురాలు భానూజా, ఐసీడీఎస్ రిటైర్డ్ సీడీపీఓ నిర్మలమ్మ, న్యాయవాది నరసింహులు, ఏపీయూడబ్ల్యూజే ఉమ్మడి జిల్లా మాజీ కార్యదర్శి ప్రసాద్ తదితరులు ఈ ప్రాంతానికి జరుగుతున్న అన్యాయంపై గళం విన్పించారు.

క్లుప్తంగా

నేటి నుంచి పింఛన్ల పంపిణీ

పుట్టపర్తి అర్బన్: జిల్లా వ్యాప్తంగా సోమవారం నుంచి ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేయనున్నారు. ఈ మేరకు డీఆర్‌డీఏ పీడీ నరసయ్య ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. పంపిణీ ప్రక్రియ రెండు రోజులు మాత్రమే ఉంటుందని పేర్కొన్నారు. కాగా, పింఛన్ల రద్దయిన 7,163 మంది దివ్యాంగులు ఈ నెల 15వ తేదీలోపు వారి వైకల్యం 40 శాతం కంటే ఎక్కువగా ఉండేలా సదరం ద్వారా పొందిన ధ్రువీకరణ పత్రం అందజేయాలని, లేకపోతే అక్టోబర్ నెల నుంచి వారి పింఛన్‌ను పూర్తిగా నిలిపి వేయనున్నట్లు వెల్లడించారు.

బాత్రూంలో జారిపడి అర్చకుడి మృతి

కనగానపల్లి: మండలంలోని తగరకుంట గ్రామంలో ఆదివారం బాత్రూంలో కాలుజారి పడి అర్చకుడు సతీష్‌కుమార్ (45) మృతి చెందాడు. రాప్తాడు మండలం పాలచర్ల రామాలయంలో ఆయన పూజారిగా పనిచేస్తున్నాడు. కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న అయన ఆదివారం ఉదయం ఇంటి వద్ద బాత్రూంలోకి స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తు కాలుజారి కింద పడ్డాడు. దీంతో తలకు తీవ్ర గాయమైంది. కుటుంబ సభ్యులు గుర్తించి ధర్మవరంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. కాగా, సతీష్‌కుమార్‌కు భార్య, కుమారుడు ఉన్నారు.

కాలువలో కొట్టుకొచ్చిన వృద్ధురాలి మృతదేహం

- కూడేరు మండలం మరుట్లపల్లికి చెందిన చాకలి సాలమ్మగా గుర్తింపు


చాకలి సాలమ్మ మృతదేహం

కనగానపల్లి: మండలంలోని తల్లిమడుగుల సమీపంలో హంద్రీ–నీవా కాలువ నీటిలో ఆదివారం మధ్యాహ్నం ఓ వృద్ధురాలు మృతదేహం కొట్టుకువచ్చింది. గమనించిన స్థానిక యువకులు మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చి సమాచారం ఇవ్వడంతో కనగానపల్లి ఎస్‌ఐ ఎం.రిజ్వాన్, సిబ్బంది అక్కడకు చేరుకుని పరిశీలించారు. కాలువ ఎగువ ప్రాంతాల్లోని గ్రామీణులకు సమాచారం అందించి మృతురాలి ఆచూకీ గుర్తించేలా చర్యలు తీసుకున్నారు. ఈ క్రమంలో కూడేరు మండలం, మరుట్లపల్లి గ్రామానికి చెందిన చాకలి సాలమ్మ(85)గా నిర్ధారణ అయింది. శనివారం సాయంత్రం ఆమె కరుట్లపల్లి వద్ద హంద్రీ–నీవా కాలువ గట్టుపై నడుచుకుంటూ వెళుతుండగా అదుపు తప్పి నీటిలో పడినట్లుగా కూడేరులో కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారని ఎస్‌ఐ రిజ్వాన్ తెలిపారు. కాగా, కుటుంబ కలహాల నేపథ్యంలోనే ఆమె కాలువలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లుగా అనుమానాలు వ్యక్తమయ్యాయి. మృతురాలికి భర్త గౌరప్ప, ఓ కుమారుడు ఉన్నారు.

వ్యక్తి బలవన్మరణం

కళ్యాణదుర్గం రూరల్: ఆర్థిక సమస్యలు తీవ్రం కావడంతో జీవితంపై విరక్తి చెంది ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... కళ్యాణదుర్గంలోని రెవెన్యూ కాలనీలో నివాసముంటున్న శ్రీకాంత్ (52)కు భార్య, ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఫైనాన్స్ వ్యాపారంతో కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఇటీవల ఆర్థిక సమస్యలు తీవ్రమయ్యాయి. దీంతో తీవ్ర మనోవేదనకు లోనైన ఆయన ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆలస్యంగా విషయాన్ని గమనించిన కుటుంబసభ్యులు, స్థానికుల సమాచారంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

కూలిన బతుకులు!

రెక్కాడితే కానీ.. డొక్కాడని పరిస్థితి వాళ్లందరిది. పొట్ట కూటి కోసం ఇంత సద్ది మూట కట్టుకుని ఉదయాన్నే పనులకు బయల్దేరారు. ఆదివారం సెలవు దినమైనా.. పిల్లాపాపలతో ఆడుకోకుండా వారి భవిష్యత్తును బాగుపరచాలని కూలి పనులకు సిద్ధమయ్యారు. అయితే ఊరు దాటిన పది నిమిషాలకే గడిచిన కాలానికి సమాధి కట్టిన జ్ఞాపకమై మిగిలారు. టెంపో రూపంలో దూసుకొచ్చిన మృత్యువు ఇద్దరు మహిళా కూలీలను కబళించింది. దీంతో బుక్కపట్నం మండలం బుచ్చయ్యగారిపల్లిలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

- వ్యవసాయ కూలీలతో వెళుతున్న ఆటోను ఢీకొన్న టెంపో
- ఇద్దరు మహిళా కూలీల దుర్మరణం
- 11 మందికి గాయాలు
- కొత్తచెరువు మండలం మైలసముద్రం సమీపంలో ఘటన
- అందరూ బుక్కపట్నం మండలం బుచ్చయ్యగారిపల్లి వాసులే


మైలసముద్రం వద్ద ప్రమాదానికి గురైన ఆటో


ప్రమాదానికి కారణమైన టెంపో


మల్లెల లక్ష్మీదేవి (ఫైల్)


మృతురాలు వలిపి లక్ష్మీనరసమ్మ

సాక్షి, పుట్టపర్తి/కొత్తచెరువు: శ్రీసత్యసాయి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కొత్తచెరువు మండలం మైలసముద్రం సమీపంలో వ్యవసాయ కూలీలతో వెళుతున్న ఆటోను ఎదురుగా శరవేగంగా దూసుకొచ్చిన టెంపో వాహనం ఢీకొంది. ఘటనలో ఆటోలోని ఇద్దరు మహిళా కూలీలు దుర్మరణం చెందారు. ఆటో డ్రైవర్‌తో సహా మరో 11 మంది గాయపడ్డారు. ఇందులో 8 మంది పరిస్థితి విషమంగా ఉంది.

మిన్నంటిన ఆర్తనాదాలు

ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు అప్రమత్తమయ్యారు. ఆగమేఘాలపై సహాయక చర్యలు చేపట్టి క్షతగాత్రులను కొత్తచెరువులోని పీహెచ్‌సీకి తరలించారు. క్షతగాత్రులు, బంధువుల ఆర్తనాదాలతో పీహెచ్‌సీ హోరెత్తింది. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం క్షతగాత్రులను కుటుంబసభ్యులు అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు.

నిర్లక్ష్యం.. అతి వేగమే కారణం

దిన కూలి పనుల కోసం ఆదివారం ఉదయం బుక్కపట్నం మండలం బుచ్చయ్యగారిపల్లి నుంచి మహిళా కూలీలతో చెన్నేకొత్తపల్లి మండలం వెంకటాంపల్లికి ఆటో బయలుదేరింది. కొత్తచెరువు మండలం మైలసముద్రం దాటిన తర్వాత మలుపు వద్ద ఎదురుగా శరవేగంగా దూసుకొచ్చిన టెంపో వాహనం ఢీకొట్టింది. ఇరుకైన రోడ్డు కావడం.. అవతలి వైపు నుంచి వస్తున్న వాహనాలు కనిపించకపోవడంతో ప్రమాదం నుంచి ఆటో తప్పించుకోలేకపోయింది. ప్రమాదంలో లక్ష్మీనరసమ్మ (70) దుర్మరణం పాలు కాగా.. కొత్తచెరువు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ లక్ష్మీదేవి (50) మృతి చెందింది. తీవ్రంగా గాయపడిన 8 మందికి ప్రథమ చికిత్స అందజేసి అనంతపురానికి రెఫర్ చేశారు. స్వల్ప గాయాలైన ముగ్గురు చికిత్స చేయించుకుని ఇంటికెళ్లారు. టెంపో డ్రైవర్ నిర్లక్ష్యం.. అతి వేగమే ప్రమాదానికి కారణంగా ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

ఆటోలో ఉన్నది వీరే..

ఆదివారం ఉదయం బుచ్చయ్యగారిపల్లి నుంచి బయలుదేరిన ఆటోలో మహిళా కూలీలు లక్ష్మీదేవి, లక్ష్మీనరసమ్మ, లక్ష్మమ్మ, మీనమ్మ, రాజేశ్వరి, చిన్న నాగమ్మ, వెంకట నారాయణమ్మ, గంగమ్మ, రమాదేవి, గోపాల్ (డ్రైవర్)తో పాటు మరో ముగ్గురు ఉన్నారు. టెంపో వాహనంలో ఉన్న ఇద్దరు సురక్షితంగా బయటపడ్డారు.

ఆస్పత్రి వద్ద ఆందోళన

ఇటీవల కదిరి ప్రభుత్వాస్పత్రిలో వైద్య సిబ్బందిపై కొందరు అల్లరిమూకలు దాడి చేసిన నేపథ్యంలో మైలసముద్రం వద్ద చోటు చేసుకున్న ప్రమాదంపై పోలీసులు అప్రమత్తమయ్యారు. దీంతో కొత్తచెరువు పీహెచ్‌సీ వద్ద భారీగా బలగాలను మోహరింపజేశారు. బాధితుల తరఫున వచ్చిన వాళ్లందరూ ఆస్పత్రిలోకి వెళ్లేందుకు ప్రయత్నించగా.. కుదరదని చెప్పడంతో కాసేపు వాగ్వాదం చోటు చేసుకుంది. ఆ తర్వాత పోలీసు అధికారులు రంగంలోకి దిగడంతో సమస్య సద్దుమణిగింది. ఆస్పత్రిలో ఒకరు మరణించడంతో చూసేందుకు గ్రామస్తులు ఎగబడ్డారు. మధ్యాహ్నం వరకూ పోలీసులు బందోబస్తులో ఉన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ మారుతీశంకర్ తెలిపారు.

అనంత యువకుడి దుర్మరణం


అంజన్‌కుమార్ (ఫైల్)

పెనుకొండ రూరల్: టైర్ బరెస్ట్ అయి కారు అదుపు తప్పిన ఘటనలో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు.. అనంతపురం నగరంలోని మొదటి రోడ్డులో నివాసముంటున్న గొల్ల అంజనకుమార్ (34)కు భార్య రాజేశ్వరి, ఓ కుమారుడు ఉన్నారు. ఎరువుల వ్యాపారంతో కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈ క్రమంలో వ్యాపార నిమిత్తం బెంగళూరుకు వెళ్లిన అంజనకుమార్.. ఆదివారం వేకువజామున కారులో తిరుగు ప్రయాణమయ్యాడు. తెల్లవారుజామున పెనుకొండ మండలం గుట్టూరు సమీపంలోని వై జంక్షన్ వద్ద 44వ జాతీయ రహదారిపై కంచర్ల హోటల్ వద్దకు చేరుకోగానే కారు టైర్ బరెస్ట్ అయింది. దీంతో డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో కారు అదుపు తప్పి జాతీయ రహదారి భద్రత కోసం ఏర్పాటు చేసిన ఇనుప ప్రహరీలోకి దూసుకెళ్లింది. తీవ్రంగా గాయపడిన అంజనకుమార్‌ను స్థానికులు వెంటనే పెనుకొండలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే అతను మృతి చెందినట్లు ధ్రువీకరించారు. ఘటనపై కియా పీఎస్ ఎస్‌ఐ రాజేష్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

పెళ్లి రోజే... మృత్యు ఒడికి!


హరిత మృతదేహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నేత తోపుదుర్తి రాజశేఖరరెడ్డి

- మృతురాలు ఎం.చెర్లోపల్లి మాజీ ఎంపీటీసీ కోడలు


భర్తతో కపాడం హరిత (ఫైల్)

రాప్తాడు: మండలంలోని ఎం.చెర్లోపల్లి గ్రామానికి చెందిన కపాడం నాగన్న, కపాడం రామాంజినమ్మ దంపతుల (ఇద్దరూ మాజీ ఎంపీటీసీ సభ్యులు) కుమారుడు రామ్మోహన్ భార్య హరిత (26) గత నెల 29న అనారోగ్యంతో హైదరాబాద్‌లో మృతి చెందింది. వీరికి ఏడేళ్ల క్రితం 2018, ఆగస్టు 29న వివాహమైంది. రామ్మోహన్ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ అక్కడే భార్యతో కలసి ఉంటున్నాడు. నెల రోజుల క్రితం గొంతు నొప్పితో బాధపడుతున్న హరితను హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి రామ్మోహన్ పిలుచుకెళ్లి చికిత్స చేయించాడు. ఆ సమయంలో టాన్సిల్స్‌తో ఆమె బాధపడుతోందని, శస్త్రచికిత్స చేయాల్సి ఉంటుందని వైద్యులు నిర్ధారించారు. తాత్కాలికంగా మందులు ఇవ్వడంతో అప్పట్లో ఇంటికి చేరుకున్నారు. ఈ క్రమంలో గత నెల 29న పెళ్లి రోజును హైదరాబాద్‌లో వేడుకగా జరుపుకున్నారు. అదే రోజు మధ్యాహ్నం గొంతు నొప్పి తీవ్రం కావడంతో హరితను ఆస్పత్రికి తీసుకెళ్లడంతో పరిశీలించిన వైద్యులు వెంటనే సర్జరీకి ఏర్పాట్లు చేశారు. ఆపరేషన్ థియేటర్‌లోకి తీసుకెళ్లిన తర్వాత తీవ్ర ఒత్తిడికి లోనైన హరిత గుండెపోటుకు గురై మృతి చెందింది. దీంతో ఆమె మృతదేహాన్ని ఆదివారం స్వగ్రామానికి చేర్చి, బంధుమిత్రుల సమక్షంలో అంత్యక్రియలు పూర్తి చేశారు. స్థానిక నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు తోపుదుర్తి రాజశేఖరరెడ్డి... ఎం.చెర్లోపల్లికి చేరుకుని హరిత మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం రోడ్డు ప్రమాదంలో గాయపడిన వైస్ ఎంపీపీ బోయ రామాంజినేయులును రాప్తాడులో పరామర్శించారు. ఆయన వెంట మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ సాకే వెంకటేష్, యూత్ మండల కన్వీనర్ విశ్వనాథ రెడ్డి, యూత్ మాజీ కన్వీనర్ చిట్రెడ్డి సత్యనారాయణరెడ్డి ఉన్నారు.

ఇళ్లలోకి దూసుకెళ్లిన లారీ


ప్రమాదంపై ఆరా తీస్తున్న పోలీసులు (చిత్రంలో) బోల్తాపడిన లారీ

బత్తలపల్లి: మండలంలోని గుమ్మల్లకుంట క్రాస్ ఎస్సీ కాలనీలో ఇళ్లలోకి ఓ లారీ దూసుకెళ్లింది. పోలీసులు తెలిపిన మేరకు... చెన్నై నుంచి అనంతపురం వైపుగా ఆదివారం తెల్లవారుజామున అగ్గి పెట్టెల లోడుతో వెళుతున్న గుమ్మల్లకుంట క్రాస్ వద్దకు చేరుకోగానే జాతీయ రహదారిపై డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో అదుపు తప్పి ఎస్సీ కాలనీలోకి దూసుకెళ్లింది. డ్రైనేజీ కాలువ దాటుకుని రోడ్డు పక్కన ఉన్న మేరీ దుకాణాన్ని ఢీ కొంది. అక్కడితో ఆగకుండా పక్కనే ఉన్న పెద్దన్న ఇంటిని ఢీకొని బోల్తాపడింది. డ్రైవర్ నిద్రమత్తులో జోగడమే ప్రమాదానికి కారణంగా తెలుస్తోంది. దుకాణం పూర్తిగా ధ్వంసమైంది. రూ.80 వేలు విలువ చేసే సరుకులు పాడయ్యాయి. పెద్దన్న ఇల్లు కూడా పాక్షికంగా దెబ్బతినడంతో రూ.30వేలు వరకు నష్టం వాటిల్లింది. ప్రమాదం జరిగిన సమయంలో జన సంచారం లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. లారీ డ్రైవర్, క్లీనర్ సురక్షితంగా బయటపడ్డారు. సమాచారం అందుకున్న ఏఎస్‌ఐ వెంకటేశులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

కారు ఢీ.. గొర్రెల మృతి

మండలంలోని రామాపురం వద్ద జీవాల మందపై కారు దూసుకెళ్లిన ఘటనలో నాలుగు గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం. అయితే కారు డ్రైవర్, గొర్రెల యజమానులు రాజీ కావడంతో ఘటనపై ఎలాంటి ఫిర్యాదు లేదని పోలీసులు తెలిపారు.

అ'పూర్వ' సమ్మేళనం


కార్యక్రమానికి హాజరైన పూర్వ విద్యార్థులు

నల్లమాడ: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1994–95లో పదో తరగతి చదువుకున్న వారు అదే పాఠశాల వేదికగా ఆదివారం కలుసుకున్నారు. మూడు దశాబ్దాల తర్వాత కలుసుకున్న వారి ఆనంధానికి అవధుల్లేకుండా పోయాయి. నాటి చిలిపి పనులు గుర్తు చేసుకుని మురిసిపోయారు. నాటి గురువులు వెంకటరమణప్ప, దేవవరం, బాషా, సుబహాన్, రమాదేవి, ప్రస్తుత హెచ్‌ఎం భాస్కర్‌రెడ్డి, వార్డెన్ రవిచంద్రరాజును ఘనంగా సత్కరించి, ఆశీర్వాదం తీసుకున్నారు. పాఠశాల ఆవరణలోని జువ్వి చెట్టు చుట్టూ అరుగు నిర్మించేందుకు నల్లసింగయ్యగారిపల్లికి చెందిన పూర్వ విద్యార్థి ఎం.శ్రీనివాసులు రూ.20 వేలు అందజేశారు.

జాతీయస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపిక


నిఖ్యశ్రీని అభినందిస్తున్న బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధులు

ధర్మవరం అర్బన్: జాతీయస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ధర్మవరానికి చెందిన నిఖ్యశ్రీ అనే క్రీడాకారిణి ఎంపికైనట్లు ఉమ్మడి జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అసోసియేట్ కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలోనున్న బాస్కెట్‌బాల్ కోర్టులో ఆదివారం సదరు క్రీడాకారిణిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాకినాడ జిల్లా పిఠాపురంలో ఇటీవల జరిగిన అంతర్ జిల్లాల పోటీల్లో ఉమ్మడి అనంతపురం బాస్కెట్‌బాల్ జట్టులో ప్రతిభ కనబరచిన ధర్మవరం క్రీడాకారిణి నిఖ్యశ్రీ రాష్ట్ర జట్టుకు ఎంపికైందన్నారు. ఈమె సెప్టెంబర్ 2 నుంచి 9 వరకు పంజాబ్ రాష్ట్రం లూధియానా నగరంలో జరిగే 75వ జూనియర్ నేషనల్ బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ బాస్కెట్‌బాల్ బాలికల జట్టు తరఫున పాల్గొంటుందన్నారు. జాతీయస్థాయిలో కూడా రాణించి ధర్మవరానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ధర్మాంబ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు మేడాపురం రామిరెడ్డి, కార్యదర్శి వాయల్పాడు హిదయ్‌తుల్లా, కోచ్ సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో బుక్కపట్నం హైస్కూల్‌కు అరుదైన గౌరవం


జేసీ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న హెచ్‌ఎం, సిబ్బంది

పుట్టపర్తి: బుక్కపట్నం బాలుర ఉన్నత పాఠశాలకు అరుదైన గౌరవం లభించింది. 2024–2025లో రాష్ట్ర, జాతీయస్థాయి క్రీడా పోటీల్లో సత్తా చాటినందుకుగాను స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డుకు ఎంపికైంది. 23 మంది క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనపరిచి రికార్డు సృష్టించడం గర్వంగా ఉందని హెచ్‌ఎం జగదీశ్వర్ అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నట్లు ఆయన తెలిపారు. క్రీడల్లో విద్యార్థులకు తర్ఫీదునిచ్చిన పీడీ నాగరాజు కార్యక్రమంలో పాల్గొన్నారు.

వినాయక నిమజ్జనంలో 'పచ్చ' రభస

గోరంట్ల: వెంకటరమణపల్లిలో అధికార టీడీపీ నాయకులు బరితెగించారు. తమ వీధిగుండా వినాయక విగ్రహాలను నిమజ్జనానికి తీసుకెళ్లరాదంటూ ఓ వర్గం.. మహిళలు, ప్రజలపై కొడవళ్లతో దాడులకు తెగబడింది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు... వెంకటరమణపల్లిలో ఆదివారం సాయంత్రం, వైఎస్సార్‌సీపీ, ప్రజలు ఏర్పాటు చేసిన వినాయకున్ని నిమజ్జనం చేయడానికి గ్రామంలో ఉరేగింపుగా తీసుకెళ్లే సందర్భంలో.. అదే గ్రామానికి చెందిన అధికార పార్టీకి చెందిన నాగు అనే వ్యక్తి మరికొంత మంది వ్యక్తులు తమ వీధిగుండా వినాయకుడిని ఉరేగింపుగా తీసుకెళ్లరాదంటూ కొడవలితో అడ్డుకోబోయాడు. దీన్ని ప్రతిఘటించిన వినాయక సేవా సమితి సభ్యులపై దాడికి యత్నించారు. దీంతో వినాయక సేవా సమితి సభ్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ బోయ శేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. దాడికి పాల్పడిన అధికార పార్టీ నాయకులపై చర్యలు తీసుకోకుండా.. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు చౌడిరెడ్డిని అదుపులోకి తీసుకొన్నారు. దీంతో ఆగ్రహించిన గ్రామస్తులు.. పోలీసుల తీరును నిరసిస్తు గ్రామంలో ధర్నాకు ఉపక్రమించారు. దీంతో పోలీసులు , ఇరు వర్గాల వారిని అదుపులోకి తీసుకొన్నారు.

నష్టం మిగిల్చిన వేరుశనగ

- పెట్టుబడి కూడా దక్కని వైనం
- ఆదుకోని ప్రభుత్వం..
- నిరాశలో రైతులు


మూలప్పగారిపల్లి వద్ద వేరుశనగ కట్టె ఆడిస్తున్న దృశ్యం

నల్లమాడ: అతివృష్టి, అనావృష్టి, చీడపీడలు, గిట్టుబాటు ధర లేకపోవడం.. దళారీల బెడదతో ఈ ఏడాది కూడా వేరుశనగ రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఖరీఫ్ ఆరంభంలోనే కోటి ఆశలతో రైతులు వేరుశనగ సాగు చేపట్టారు. వర్షాధారంగా దాదాపు వెయ్యి ఎకరాల్లో వేరుశనగ సాగులోకి వచ్చింది. ముందస్తుగా సాగు చేపట్టిన రైతులు ఇప్పటికే పంట నూర్పిడి చేసి దిగుబడిని విక్రయించారు. మరికొందరు పంట నూర్పిడి పనుల్లో నిమగ్నమయ్యారు. అయితే దిగుబడి ఆశించిన స్థాయిలో లేకపోవడంతో పెట్టుబడులు కూడా చేతికి అందడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎకరాకు రూ.10 వేలు నష్టం

ఒక ఎకరా విస్తీర్ణంలో వేరుశనగ పంట సాగుకు విత్తనాలు, ఎరువులు, మందులు, సేద్యం, పంట నూర్పిడి తదిరాలన్నీ కలిపి రూ.35 వేలు పెట్టుబడి అయినట్లు నల్లమాడ మండల రైతులు శ్రీరాములు, చిదంబరరెడ్డి, ఓబిరెడ్డి, చంద్ర తెలిపారు. పంట నూర్పిడి అనంతరం ఎకరాకు 10 మూటల దిగుబడి వచ్చింది. ప్రస్తుతం మార్కెట్‌లో 44 కిలోలు వేరుశనగ బస్తా రూ.2,500 ధర పలుకుతోంది. ఈ లెక్కన ఒక ఎకరాకు రూ.25 వేలు మాత్రమే చేతికొస్తోంది. నాలుగు నెలల పాటు కంటికి రెప్పలా పంటను కాపాడుకుంటే ఎకరాకు రూ.10 వేలు నష్టాన్ని మూట గట్టుకోవాల్సి వచ్చిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేరుశగన విత్తనం వేశాక జూన్, జూలై మాసాల్లో తీవ్ర వర్షాభావానికి తోడు చీడపీడలు పంట దిగుబడిని దెబ్బతీసినట్లు అభిప్రాయపడుతున్నారు.

ఆదుకోని ప్రభుత్వం

ఉమ్మడి అనంతపురం జిల్లాలో అత్యధికంగా రైతులు ప్రధాన పంటగా వేరుశనగనే సాగు చేస్తున్నారు. దిగుబడి రాగానే ధర సగానికి పైగా పడిపోతున్నట్లు రైతులు చెబుతున్నారు. అరకొరగా పంట దిగుబడి వచ్చినా గిట్టుబాటు ధర లేక నష్టపోతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంటల బీమా కింద ప్రీమియం మొత్తాన్ని చెల్లించినా.. బీమా పరిహారం చెల్లింపులో ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తోందని వాపోతున్నారు.

కష్టమంతా వృథా



మూడెకరాలు భూమిని కౌలుకు తీసుకుని జూన్‌లో వేరుశనగ పంట వేశా. పెట్టుబడి కింద రూ.లక్ష ఖర్చు వచ్చింది. దిగుబడి 35 మూటలు రావడంతో పెట్టుబడి మొత్తం కూడా చేతికి దక్కలేదు. మూడు నెలలకుపైగా మా కష్టమంతా వృథా అయింది.

– మాదారపు శ్రీరాములు, కౌలురైతు, మూలప్పగారిపల్లి, నల్లమాడ మండలం

గిట్టుబాటు ధర కల్పించాలి



వేరుశనగ రైతు ప్రతిసారీ నష్టపోతూనే ఉన్నాడు. ప్రభుత్వం వేరుశనగకు గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉచిత పంటల బీమాతో రైతులను ఆదుకుంది. కూటమి ప్రభుత్వంలో ఉచిత పంటల బీమా అనేది లేకుండా పోయింది. బీమా ప్రీమియంను రైతులే చెల్లించారు. అయినా పరిహారం అందజేతలో ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తోంది. ఇలాగైతేనే రైతు మనుగడ కష్టం.

– చిట్టిబాల ఆదినారాయణరెడ్డి, రైతు, రాగానిపల్లి, నల్లమాడ మండలం